చెరువుల సుందరీకరణకు చర్యలు


కాస్మోపాలిటన్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

- ప్రజల అవసరానికి అనుగుణంగా అభివృద్ధి పనులు
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ పెద్దచెరువుతో పాటు నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరణ చేసి అభివృద్ధి పరుస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మన్సూరాబాద్‌లోని పెద్దచెరువు, సరస్వతీనగర్, కాస్మోపాలిటన్ కాలనీలలో మార్నింగ్‌వాక్ చేపట్టి కాలనీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్సూరాబాద్ పెద్దచెరువులోకి డ్రైనేజీ మురుగు రాకుండ ప్రత్యేక చర్యలు చేపడుతామని తెలిపారు. బాక్స్ టైప్ ట్రంక్‌లైన్ పనులు అసంపూర్తిగా ఉండటంతో ఇబ్బందులు ఉన్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. సరస్వతీకాలనీ, కాస్మోపాలిటన్ కాలనీలలో మురుగు పొంగకుండ చర్యలు చేపడుతామని, అవసరమున్న చోట నూతన పైప్‌లైన్ పనులు చేపడుతామని చెప్పారు. సరస్వతీనగర్ కాలనీ కమ్యూనిటీహాల్ పై అంతస్తు నిర్మాణానికి, కాస్మోపాలిటన్ కాలనీ పార్కు ప్రహరీ ఎత్తు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను దశలవారీగా పరిష్కారం చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు పోచబోయిన జగదీశ్‌యాదవ్, విజయభాస్కర్, జగదీశ్‌గౌడ్, ఆయా కాలనీలవాసులు రుద్ర నర్సింహ్మా, శ్రీనివాసరావు, గంజి సత్తయ్య, శేఖర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన..
రోడ్లు జలమయం

ట్రాఫిక్ జాం – పొంగిపొర్లిన డ్రైనేజీలు


ఓల్డ్ మలక్‌పేట్‌లోని వరదనీటిలో చిక్కుకున్న ద్విచక్రవాహనదారుడు


ఓల్డ్ మలక్‌పేట్‌లోని కాలనీలో ట్రాఫిక్‌జాం కావడంతో వాహనదారుల ఇక్కట్లు

దిల్‌సుఖ్‌నగర్ : భారీ వర్షానికి మలక్‌పేట్ జోన్ పరిధిలోని పలు లోతట్టు కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు ఆదివారం జలమయమయ్యాయి. కాలనీలోని డ్రైనేజీలు రహదారులపై పొంగిపొర్లాయి.

◆ మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, చాదర్‌ఘాట్ అల్కాపురి చౌరస్తా, కొత్తపేట్‌లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

◆ దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అక్బర్‌బాగ్, ఓల్డ్ మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలడేర, మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు జలమయంగా మారాయి.

◆ మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదిర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కావడంతో కొద్దిసేపు రోడ్డుపై వాహనాలు నిలిచాయి.

◆ వర్షాలకు పై ప్రాంతాల్లోని నాలాలు పూర్తిగా పూడుకుపోయి మురుగునీరంతా రోడ్లపై కాలనీల్లో ప్రవహిస్తోంది. నాలాలలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టక పోవడంతో వరదనీరు ప్రవహించలేకపోతోంది. దీంతో కాలనీలు, బస్తీలు ముంపునకు గురయ్యాయి.

స్నేహపురి కాలనీ అధ్యక్షుడిగా సురేందర్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనంతుల సురేందర్‌రెడ్డి

నాగోలు : కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా అనంతుల సురేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కాలనీ ఉపాధ్యక్షులుగా ఎస్. దశరథ్‌రెడ్డి, రామకృష్ణారావు, కేవీఆర్‌ఎస్. మూర్తి, కార్యదర్శిగా జె.లక్ష్మీకాంతరావు, కోశాధికారిగా డీవీ. రామారావు, సంయుక్త కార్యదర్శులుగా కల్యాణి, వేణుమాధవ్, ఆర్.యాదగిరిరావు, ఎస్.రాజేశ్వరి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కె.మురళీ మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణమూర్తి, ప్రసాద్, పాపిరెడ్డి, శ్యామ్ సుందర్ బాబు, బాలబ్రహ్మాచారి, సరితారెడ్డి, నరేందర్ రెడ్డి, అనంతుల లక్ష్మారెడ్డి, శ్యామ్ సుందర్ మూర్తి, వీరానంది, ఎస్.జనార్దన్ రెడ్డి, రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కృష్ణమూర్తి వ్యవహరించారు.

చినుకు పడితే చిత్తడే

- వర్షంతో బురదమయంగా కుమ్మరికుంట కట్ట
- జీటీ రోడ్డు వేయాలని కొన్నేళ్లుగా డిమాండ్


బురద మయంగా మారిన హయత్‌నగర్- కుమ్మరికుంట రోడ్డు

హయత్‌నగర్ : అది హయత్‌నగర్–సాహెబ్‌నగర్‌కు లింకు రోడ్డు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే రహదారి. పదుల సంఖ్యలో కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు. కానీ చినుకు పడితే రోడ్డంతా చిత్తడే. అదే కుమ్మరికుంట కట్టపై నుంచి వెళ్లే రోడ్డు. హయత్‌నగర్ కుమ్మరికుంటపై నుంచి వెళ్లే రోడ్డు మట్టితో ఉంది. ఏమాత్రం వర్షం వచ్చినా రోడ్డంతా బురదమయంగా మారుతుంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు జారీ పడుతున్నారు. రోడ్డును వెడల్పు చేసి బీటీ వేయాలని కొన్నేళ్లుగా స్థానికులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కట్టను పటిష్టం చేసే క్రమంలో పనులు చేపట్టినా పనులు చేయడంలో జాప్యం కారణంగా పరిస్థితి మారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుమ్మరికుంటపై రోడ్డును వెడల్పు చేసి బీటీ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్ టెస్ట్‌కు విశేష స్పందన


ఎన్‌ఐఎఫ్‌డీలో స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

చైతన్యపురి: చైతన్యపురిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్కాలర్‌షిప్ పరీక్షకు విశేష స్పందన వచ్చిందని సంస్థ డైరెక్టర్ కన్నెబోయిన రాముయాదవ్ తెలిపారు. బిగ్‌బాస్ ఫేం రతిక రోజ్ చేతుల మీదుగా విడుదల చేసిన రూ.12 లక్షలలో రూ. 8 లక్షలను ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఫ్యాషన్ డిజైన్ డిప్లొమా పీజీ, డిగ్రీ కోర్సులలో గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించి, వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. కోర్సులలో చేరాలని ఆసక్తి ఉన్నవారు 9030610033 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ గీత, నిర్వాహకులు భవాని, నందిని, స్నేహ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు సన్మానం


ఎంపీని సన్మానిస్తున్న కార్యకర్తలు

చంపాపేట : మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సిలివేరు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాశం శ్రీశైలం, టింగ్లికర్ రాజేశ్, రమేశ్, ప్రదీప్, శ్రీనివాస్ నాయుడు, వెంకటేశ్, పవన్‌కుమార్, విష్ణు, రవీందర్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

కుంకుమార్చనతో ముగిసిన ఉత్సవాలు


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయ 19వ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు దుర్గాదేవి పంచామృత ఫలరస అభిషేకం, 7.30 గంటలకు చతుషష్ఠి ఉపచారపూజ అనంతరం 10 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన చేపట్టిన అనంతరం అమ్మవారి శేషవస్త్రాల వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్ యాదవ్, కమిటీ సభ్యులు యాదగిరి, హనుమంతరావు, రవి, మురళీ, రమణమూర్తి, కృష్ణమూర్తి, సత్తిరెడ్డి, వినోద్, ప్రమోద్, అర్చకులు బాల మురళీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు నిల్వకుండా చూడండి


జేసీబీతో పనులు చేయిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీలల్లో వరదనీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం కురిసిన వర్షానికి డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, రాజిరెడ్డినగర్, వెంకటరమణకాలనీలలో రోడ్లపై వరదనీరు చేరింది. దీంతో ఆయన కాలనీలలో పర్యటించి సిబ్బంది సహాయంతో జేసీబీలతో వరదనీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కాలనీల నాయకులు పాల్గొన్నారు.


సన్మానం అనంతరం జ్ఞాపికలతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

దిల్‌సుఖ్‌నగర్ : సరూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల 1992 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆర్కేపురం డివిజన్ మైసమ్మ దేవాలయ ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న నాటి మిత్రులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో సుదర్శన్ యాదవ్, లింగం, శివకుమార్, రాజు, శ్యాంసుందర్, సురేందర్, ప్రేమ్‌గౌడ్, ఎస్‌కే మహమ్మద్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అలకాపురంలోని శృంగేరి శంకర మఠంలోని శారదా చంద్రమౌళేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశారదాంబ అమ్మవారిని మహాసరస్వతిగా అలంకరించారు. శారదాంబాదేవికి విశేషంగా అష్టోత్తర శతకలశాభిషేకం(108), వివిధ సుగంధ ద్రవ్యాలు, వివిధ నది జలాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం హరిద్ర అలంకరణం, నారాయణసేవ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో శృంగేరి శంకర మఠ బ్రాంచ్ అధికారి కొవ్వడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు రూ.60 వేల విరాళం


విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న రాజేశ్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం పరిధిలోని ఇన్కమ్ టాక్స్ కాలనీకి చెందిన ఎస్ రాజేశ్ తన భార్య సృజన పుట్టిన రోజు సందర్భంగా విరాళం అందజేశారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేఅవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 60 వేల చెక్కును అధ్యక్షులు రాజేశ్ సమక్షంలో విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సృజన, ఆశ్రిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ఎల్బీనగర్ : సమస్యలు పరిష్కరించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీపాపిరెడ్డి కాలనీ వాసులు ఆదివారం రోడ్లపై నిలిచిన నీటిగుంట వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీ సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ, సమస్యల పరిష్కారంలో చూపడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బాలునాయక్, సోమయ్య, సుదర్శన్‌రెడ్డి, రాఘవేందర్, వెంకటేశ్వర్, ఉదయ్‌శ్రీ, ఉమాపతి, సాంబయ్య, దేవదాసు, బ్రహ్మాచారి, రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

సమస్యల పరిష్కారానికి కృషి


కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నాగోలు: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన శృంగేరి కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై కాలనీ వాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ లైన్ నిండి పొంగుతుందని, వీధి దీపాల కొరత, తాగునీటి సరఫరా సరిగ్గా రావడం లేదని కాలనీ వాసులు వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ఎటువంటి సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సుబ్బారావు, అశోక్, రవికుమార్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్ కాలనీలోని అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శ్రీవైనతేయ ఇష్టి, అగ్నిహోమం, ధ్వజారోహణ, గోపూజ, నివేదన, దేవతల ఆహ్వానం, మూలమంత్ర హోమంతో పాటు తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బిచినేపల్లి లక్ష్మీనరసింహరావు, ఆలయ కార్యదర్శి గంధం వెంకటేశ్వర్లు, కోశాధికారి నరసింహ, సభ్యులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి, లక్ష్మణరావు, రామకృష్ణయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, ఎస్‌టీ చారి, సత్యనారాయణమూర్తి, సూర్యనారాయణరెడ్డి, మురళీధరాచార్యులు, ఆలయ ప్రధాన పూజారి కారంపూడి వెంకట వరదాచార్యులు పాల్గొన్నారు.

29న హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కరణ


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న హెలెన్ కెల్లర్ విగ్రహం

చాదర్‌ఘాట్ : మలక్‌పేటలోని జాతీయ దివ్యాంగుల పార్కు ఆవరణలో ఈనెల 29వ తేదీన హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క హాజరవుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 59, వంకాయ 35, బెండ 45, పచ్చి మిర్చి 70, కాకర 55, బీర 45, క్యాబేజి 28, ఫ్రెంచి బీన్స్ 105, క్యారెట్ 40, దొండ 26–35, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 28, క్యాప్సికం 70, ఆలు 35, దోస 23, సొర 11, పొట్ల 23, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 37. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ప్రణాళికలతో అభివృద్ధి పనులు


సీఎస్‌ఆర్ కాలనీలో ట్రంక్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజల అవసరాలకు అనుగుణంగా డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రణాళికలతో చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని శివగంగా కాలనీ, వీరన్నగుట్ట, షిర్డీ సాయినగర్ కాలనీ, వరదనగర్, ఆర్టీసీ కాలనీ, సీఎస్‌ఆర్ కాలనీలలో ఆదివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండ ట్రంక్‌లైన్ లెవలింగ్ చూసుకుని పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అభివృద్ధి పనులను కాలనీ వాసులు పర్యవేక్షించుకోవడం అభినందనీయమని తెలిపారు. వరదనగర్, శివగంగా కాలనీలలో పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని కాలనీ వాసులు తన దృష్టికి తీసుకొచ్చారని, వాటికి ప్రహరీలు నిర్మించి రక్షిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీలవాసులు శ్రీశైలం, నరేశ్, బాబురావు, శ్రీధర్‌రెడ్డి, నర్సింహ్మాయాదవ్, కోటయ్య, సత్యం, నరేంద్రకుమార్, చిన్నయాదవ్, బాలాజీ, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కడారి యాదగిరి యాదవ్, రమేశ్‌చారి, మాధవి, నాగేంద్రచారి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆదర్శం

వర్ధంతి సందర్భంగా నేతల ఘన నివాళి


చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేందర్ యాదవ్

చంపాపేట: శ్యామాప్రసాద్ ముఖర్జీ నేటి యువతకు ఆదర్శమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రాంపురం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చంపాపేట చౌరస్తాలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాజుల శేఖర్, యోగిరాజ్, శ్రీనిధి, గూడూరు అవినాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

చైతన్యపురి : డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ గొప్ప జాతీయవాది అని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వర్ధంతి సందర్భంగా కమలానగర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాంరెడ్డి, లక్ష్మీదేవి, రాజేశ్వరి, రూప్లా నాయక్, వెంకట్‌రెడ్డి, సుజాత, మధుసూదన్, బాబు చౌదరి, లక్ష్మి, సిరిరెడ్డి పాల్గొన్నారు.

మలక్‌పేట : బీజేపీ మూసారంబాగ్ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణతులసినగర్ కమ్యూనిటీ హాల్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, దేవేందర్, సురేందర్, దినేశ్, శ్రీనివాస్, గణేశ్, లక్ష్మణ్, ఉదయ్, ప్రభు, మురళీ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సామ రంగారెడ్డి

క్రాంతిహిల్స్ కాలనీలో..

వనస్థలిపురం: వనస్థలిపురం క్రాంతిహిల్స్ కాలనీలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగోలు : హిందువుల హక్కులకై గొంతెత్తి నినదించిన చైతన్య దీప్తి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ అన్నారు. నాగోల్ డివిజన్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణగౌడ్, సంజీవరెడ్డి, మల్లేశ్, మనోహర్ రెడ్డి, దశరథ్ సాగర్, భాస్కర్, చంద్రశేఖర్ గుప్తా, ప్రభాకర్ గౌడ్, కవిత, శివ కుమార్ పాల్గొన్నారు.

సైదాబాద్: సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్వహించిన వర్ధంతిలో కార్పొరేటర్ కొత్తరావు అరుణరవీందర్‌రెడ్డితో కలిసి బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి నివాళులర్పించారు. అదేవిధంగా ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని శివాజీచౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ శ్వేతమధుకర్ రెడ్డి హాజరయ్యారు. నివాళులర్పించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు పాల్గొన్నారు.